క్లుప్తంగా

తహసీల్దార్‌గా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ



దాచేపల్లి : మండల తహసీల్దార్‌గా జి. శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. అచ్చంపేట మండలం నుంచి బదిలీపై ఆయన దాచేపల్లికి వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన కె.వి. కుటుంబరావు గురజాలకు బదిలీ అయ్యారు. ప్రత్యేకంగా పూజలు చేసిన అనంతరం శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయం సిబ్బంది ఆయన్ను శాలువాతో సన్మానించారు. సమస్యలపై ప్రజలు, రైతులు నేరుగా తనను కలవ వచ్చని, సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని ఆయన చెప్పారు.

పిడుగురాళ్ల ఏవోగా సంధ్యారాణి



పిడుగురాళ్ల: మండల వ్యవసాయ శాఖ అధికారిణిగా ఎం. సంధ్యారాణి గురువారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీలో భాగంగా గురజాల నుంచి పిడుగురాళ్ల మండలానికి బదిలీ అయ్యారు. ఇప్పటివరకు పిడుగురాళ్ల వ్యవసాయ శాఖ అధికారిగా విధులు నిర్వహించిన నందిపాటి శ్రీనివాసరెడ్డి తెనాలి డివిజన్ కొల్లిపర మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఏవో సంధ్యారాణి మాట్లాడుతూ రైతులకు సూచనలు, సలహాలు అందిస్తూ అన్ని వేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు సకాలంలో అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

గురజాల ఏవోగా పుల్లారెడ్డి



గురజాల రూరల్ : మండల వ్యవసాయాధికారిగా పుల్లారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన వెల్దుర్తి మండల వ్యవసాయాధికారిగా పని చేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా గురజాలకు వచ్చారు. ఇప్పటివరకు గురజాల మండల వ్యవసాయాధికారిణిగా పని చేసిన ఎం. సంధ్యారాణి పిడుగురాళ్లకు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన పుల్లారెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. పుల్లారెడ్డిని పలువురు కలిసి అభినందనలు తెలిపారు.

డీఈగా శ్రీనివాసరావు సేవలు అభినందనీయం



పిడుగురాళ్ల: మున్సిపల్ డీఈగా శ్రీనివాసరావు సేవలు అభినందనీయమని ఏఈ రాఘవేంద్రరావు పేర్కొన్నారు. ఆయన బదిలీ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో గురువారం సిబ్బంది ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏఈ రాఘవేంద్రరావు మాట్లాడుతూ తోటి ఉద్యోగులతో శ్రీనివాసరావు స్నేహభావంతో మెలిగేవారని తెలిపారు. విధుల్లో నిబద్ధత, సమయపాలన ఆయన ప్రత్యేకతని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ డీఈగా ఆదం షఫీ బాధ్యతల స్వీకరణ



పిడుగురాళ్ల: స్థానిక మున్సిపల్ కార్యాలయ డీఈగా షేక్ ఆదం షఫీ గురువారం బాధ్యతల స్వీకరించారు. సాధారణ బదిలీలో భాగంగా మార్కాపురం నుంచి పిడుగురాళ్లకు వచ్చారు. ఇక్కడ డీఈగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు మార్కాపురం బదిలీ అయ్యారు. ఆయన బాధ్యతలను ఆదాయం షఫీకి అప్పగించారు. షఫీకి గతంలో పిడుగురాళ్ల మున్సిపల్ ఏఈగా విధులు నిర్వహించిన అనుభవం ఉంది. పిడుగురాళ్ల పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారినప్పుడు మొదటి మున్సిపల్ ఏఈగా ఆయన పని చేశారు. పట్టణ ప్రజలకు తాను సుపరిచితుడనని, మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

రైతులు ఈకేవైసీ నమోదు చేయించుకోవాలి

ఏవో కె.దేవదాను

నకరికల్లు: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలను పొందేందుకు అర్హత కలిగిన రైతులందరూ రైతుసేవా కేంద్రంలో ఈకేవైసీ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.దేవదాసు గురువారం తెలిపారు. మండలంలో 9,717 మంది రైతులను అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకానికి అర్హులుగా గుర్తించామన్నారు. ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలని సూచించారు. రైతు పట్టాదార్ పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలని ఆయన సూచించారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శ్రీకారం

- జానపాడు రోడ్డులో ఆక్రమణల తొలగింపు ప్రారంభం
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చొరవతో రూ. 52 కోట్ల మంజూరు



జేసీబీతో తొలగిస్తున్న ఆక్రమణలు

పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులో రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులలో భాగంగా గురువారం ఇరువైపులా ఆక్రమణలను అధికారులు, కాంట్రాక్టు సంస్థ సిబ్బంది తొలగింపు చేపట్టారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే అప్పటి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చొరవతో రూ. 52 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయడంతో పాటు శంకుస్థాపన కూడా చేసిన సంగతి తెలిసినదే. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడిచినా జానపాడు రైల్వే బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభించకపోవడంతో కాసు మహేష్ రెడ్డి కోర్టుకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. దీంతో అధికార పార్టీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఎట్టకేలకు స్పందించి హుటాహుటిన రెండోసారి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత కూడా కాసు మహేష్ రెడ్డి పలుమార్లు విలేకరుల సమావేశంలో రైల్వే బ్రిడ్జి నిర్మాణం పనులు త్వరగా ప్రారంభించాలని అధికార పార్టీ నాయకులు, అధికారులను డిమాండ్ చేశారు. ఎట్టకేలకు జానపాడు రోడ్డు రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ముందుకు వచ్చారు.

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు



మాట్లాడుతున్న విద్యుత్ శాఖాధికారులు

వెల్దుర్తి: విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాలు గురువారం పల్నాడు జిల్లా పర్యవేక్షణ ఇంజనీర్ టి. విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మండలంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఇందులో 55 మంది అధికారులు, 165 మంది సిబ్బంది 55 బృందాలుగా ఏర్పడి 4071 సర్వీసులను తనిఖీ చేశారు. మండలంలోని శిరిగిరిపాడు, గొట్టిపాళ్ల, గుండ్లపాడు, మండాది, ఉప్పలపాడు, బోదిలవీడు, చినపర్లపాయితండా, గంగలకుంట గ్రామాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. అందులో మీటర్ లేకుండా డైరెక్ట్‌గా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 66 మంది నుంచి రూ. 99వేలు, అనుమతించిన కేటగిరి కాకుండా ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుతున్న ఏడుగురి నుంచి రూ. 40వేలు, అనుమతించిన దానికంటే అదనంగా వాడుతున్న 15 మందికి రూ. 48వేలు కలిపి రూ. 2,93,000ను అపరాధ రుసుంగా వసూలు చేసినట్లు తెలిపారు. సాగర్ తీర ప్రాంతంలోని మీటర్లకు సీలు త్వరగా పాడైపోయే అవకాశమున్నందున అప్పుడప్పుడు పరిశీలించాల్సిన అవసరం ఉందని ఆయన వినియోగదారులకు సూచించారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని తెలిపారు. ఫిర్యాదులకు 9440812263ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఈఈ సీహెచ్. వెంకటేశ్వరరావు, డీఈఈ సింగయ్య, మల్లికార్జున ప్రసాద్, రామయ్య, ఏఈలు కోటేశ్వరరావు, సతీష్‌కుమార్, శివశంకర్, డానియేల్, సూరజ్ పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడి అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ జగదీష్

మాచర్ల రూరల్: ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకొని వారి మెడలోని గొలుసులను లాక్కెళ్లిన నిందితుడి నుంచి పది లక్షల రూపాయల విలువైన బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు గురజాల డీఎస్పీ పి. జగదీష్ తెలిపారు. పట్టణ పోలీసు స్టేషన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాచర్ల రేల్వే స్టేషన్‌కు ఎదురుగా ఉన్న వీధిలోని ఓ ఇంటిలో ఒంటరిగా ఉన్న మహిళ మెడలో గొలుసును గురజాలకు చెందిన షేక్ జాని లాక్కొని పారిపోయాడని తెలిపారు. ఫిర్యాదు అందిన క్షణాల్లోనే సీఐ పచ్చిపాళ్ల ప్రభాకర్‌రావు నేతృత్వంలో ఎస్‌ఐలు సంధ్యారాణి, పి. వెంకటరమణలు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారన్నారు. ఆయా ప్రాంతాలలోని సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడి చిత్రాలను సంబంధిత పోలీసు స్టేషన్‌లకు అందించి సమాచారాన్ని సేకరించారన్నారు. నిందితుడిగా జానీని గుర్తించి అంబేడ్కర్ సెంటర్‌లో అదుపులోకి తీసుకొని విచారించామని వివరించారు. ఇందులో 13వ వార్డు, ఓల్డ్ టౌన్ ఏరియాలోనూ మహిళల మెడలో గొలుసులు లాక్కొని వెళ్లినట్లు తేలిందని చెప్పారు. జానీని అరెస్టు చేసి పది లక్షల రూపాయలు విలువైన 128 గ్రాముల బంగారపు వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితుడిని అరెస్టు చేసి వస్తువులను రికవరీ చేయడంలో చాకచక్యంగా పనిచేసిన పట్టణ సీఐ ప్రభాకర్, ఎస్‌ఐలు జి. సంధ్యారాణి, పి .వెంకటరమణలను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో ఏఎస్‌ఐ రమేష్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి ఆలయ వార్షికోత్సవం



వేంకటేశ్వరస్వామి దేవాలయం

వెల్దుర్తి: మండలంలోని మిట్టమీదిపల్లెలో గల శ్రీ అలివేలు మంగ, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు యండపల్లి సుబ్బారావు స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపారు. భక్తులు తెల్లవారుజాము నుంచే మొక్కుబడులు, నైవేద్యాలు సమర్పించారు. ఆలయ నిర్వాహకులు మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఉదయం 10గంటలకు స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

మున్సిపల్ సమావేశంలో అన్ని అంశాలు ఏకగ్రీవం

మాచర్ల: పట్టణంలోని పురపాలక సంఘ సాధారణ సమావేశాన్ని గురువారం మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్ అధ్యక్షతన నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు అజెండాలో పేర్కొన్న 15 అంశాలు చర్చించారు. అన్నింటిని కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. వెనుకబడిన వార్డుల్లో రోడ్ల అభివృద్ధి, విద్యుత్ లైనుల మరమ్మతులు, మురుగు కాల్వలు, రోడ్ల నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. ఆయా వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలపై అన్ని అంశాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. గతంలో కౌన్సిల్ సమావేశంలో పలు రకాల పనులు చేపట్టకుండానే బిల్లులు తీసుకున్న వారిపై చర్యలు తీసుకునేలా తీర్మానం చేశారు. సమావేశంలో మున్సిల్ వైస్ చైర్‌పర్సన్ సిద్ధమ్మ, పోలూరి నరసింహారావు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ డి.నరేంద్ర, డీఈ సుభాని, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ప్రతిభావంతులకు నగదు పంపిణీ



నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థి రవీంద్రారెడ్డి

మాచర్ల రూరల్: పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యంత ప్రతిభ కనబరచిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ పూర్వ విద్యార్థి రవీంద్రారెడ్డి అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని హెచ్‌ఎం ఐ.వి. నాగమణి కొనియాడారు. గురువారం మండలంలోని కొప్పునూరు హైస్కూలులో రవీంద్రారెడ్డి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యాపరంగా వెనుకబాటుతనం ఎదుర్కొంటున్న పల్నాటి ప్రాంతంలో విద్యను ప్రోత్సహించేందుకు రవీంద్రారెడ్డి రూ. 10వేలను 500కు పైగా మార్కులు సాధించిన వారికి అందించడం అభినందనీయమని తెలిపారు. ఇదే స్ఫూర్తితో పూర్వ విద్యార్థులంతా పాఠశాలల అభివృద్ధికి చేయూతనివ్వాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పారావు, టి. శ్రీనివాసరావు, పెద యాసఫ్, రామ్మోహన్, ప్రసాద్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వీరాంజనేయులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

యోగాసనాలు వేసిన కార్మిక శాఖ అధికారులు, సిబ్బంది

నరసరావుపేట: యోగా మానసిక ప్రశాంతత, ఒత్తిడి నియంత్రణకు ఎంతగానో దోహదపడుతుందని కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం యోగా వీధిలో కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది, ప్రజలతో మాట్లాడారు. నిత్యం విధుల్లో ఒత్తిడికి లోనయ్యే సిబ్బందికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. జిల్లా ప్రజలు, యువత దీనిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

15న చెస్ టోర్నమెంట్



గురజాల : కీర్తి చెస్ అకాడమి ఆధ్వర్యంలో ఈనెల 15న చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు కె. సాల్మన్ తెలిపారు.స్థానిక అక్షర పాఠశాలలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఎంట్రీ ఫీజు రూ. 50 చెల్లించాలన్నారు. అండర్ 15 వరకు గురజాల, మాచర్ల రెండు నియోజకవర్గాల స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు 7386851613, 8978926285 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు. విజేతలకు పతకాలు అందిస్తామని తెలిపారు.

షిర్డీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్(రెంటచింతల): మండల పరిధిలోని పాలువాయి జంక్షన్‌లో గల షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం భక్తులు ఆలయ అర్చకులు గోపాల్ పాండే ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎంతో మహిమ గల బాబాని పూజిస్తే తాము కోరిన కోరికలు నెరవేరుతాయనే భావంతో పల్నాడు ప్రాంతంలోని అనేక గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో మందిరానికి చేరుకున్నారు. సాయినాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో భజన బృందం ఆలపించిన బాబా గీతాలకు భక్తులు తన్మయత్వం చెందారు. ఏర్పాట్లను దేవస్థానం చైర్మన్ పందిరి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

నేడు పోలేరమ్మ దేవస్థానం వార్షికోత్సవం



మంచికల్లు(రెంటచింతల): మండలంలోని మంచికల్లులో గల పోలేరమ్మ దేవస్థానం 13వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ప్రధాన అర్చకులు కారంపూడి వెంకటాచార్యులు గురువారం తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాతం, 6 గంటలకు పంచామృతాభిషేకాలు అనంతరం పలు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు మహాన్నదానం చేయనున్నట్లు వెల్లడించారు. సాయంత్రం 5 గంటల నుంచి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవారి ఉత్సవ విగ్రహంతో మేళతాళాల మధ్య గ్రామోత్సవం జరుగుతుందని తెలిపారు.

మాచర్లలో భారీ వర్షం

మాచర్ల: పట్టణంలో గురువారం భారీ వర్షం కురిసింది. ఎండల వేడితో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు సుమారు 2 గంటల పాటు వర్షం కురవడంతో సేద తీరారు. రోడ్లు, డ్రెయినేజీ కాల్వలు పొంగి పొర్లాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. రైతులు సాగు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

భక్తిశ్రద్ధలతో పౌర్ణమి గరుడ సేవ



సత్తెనపల్లి: జ్యేష్ఠ మాస శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని పట్టణ రైల్వేస్టేషన్ రోడ్డులోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం రాత్రి విశేషంగా శ్రీవారికి జ్యేష్ఠాభిషేకం నిర్వహించారు. రెండు గంటల పాటు జరిగిన స్నపన తిరుమంజనంలో కురువేరు, తెల్లపట్టు, రంగురంగుల ఎండు ఫలాలు, వట్టివేరు, పసుపు రోజా మాలలను శ్రీవారికి అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమాన్ చిత్రకవి శ్యాము ఆచార్య రామానుజస్వామి శ్రీ, భూ, పురుష, నీలా, నారాయణ సూక్తాలను పఠిస్తుండగా పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో ఉత్సవ మూర్తులకు విశేషంగా అభిషేకం చేపట్టారు. అనంతరం పురవీధులలో మంగళ వాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ గరుడ వాహనంపై స్వామి వారు భక్తులకు అభయ ప్రదానం చేశారు. ఏకాంత సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విమాన ప్రమాదం విషాదకరం

మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి



పిడుగురాళ్ల: అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం విషాదకరమని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి గురువారం రాత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాద ఘటన తెలిసి దిగ్భ్రాంతికి గురయ్యానని చెప్పారు. ఈ దుర్ఘటనలో సుమారు 200కు పైగా ప్రాణాలు కోల్పోవడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన బాధితుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ-2 శివ నాగేశ్వరరావు

రెంటచింతల: మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, జెడ్పీ, కస్తూర్బా, ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్ తదితర పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, బెల్టులు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలను పంపిణీ చేసినట్లు ఎంఈఓ-2 వై.శివ నాగేశ్వరరావు తెలిపారు. ఆయన గురువారం స్థానిక ఆంజనేయస్వామి మాన్యంలోని ఎంపీయూపీఎస్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు హెచ్‌ఎం పీసీహెచ్ నాసరయ్యతో కలిసి టెక్స్ట్, నోట్‌బుక్స్ పంపిణీ చేసి అనంతరం మాట్లాడారు. మండల పరిధిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న 37 పాఠశాలల్లో మొత్తం 3,322 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. వీరికి అవసరమైన 16,490 టెక్స్ట్ బుక్స్, 33 వేల నోట్‌బుక్స్, 2,236 బెల్టులు, 416 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు వచ్చినట్లు తెలిపారు. త్వరలోనే బ్యాక్స్, యూనిఫాం, బూట్లు కూడా రానున్నట్లు చెప్పారు. ముందుగా మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన సన్న బియ్యాన్ని పరిశీలించారు.

విద్యార్థులను మోసం చేసిన కూటమి ప్రభుత్వం



షేక్ సుభాని

దాచేపల్లి : కూటమి ప్రభుత్వం విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేసిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం గురజాల నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ సుభాని విమర్శించారు. దాచేపల్లిలోని ఆయన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాఠశాలలు పునః ప్రారంభించిన రోజునే తల్లికి వందనం నగదును తల్లుల అకౌంట్‌లో జమ చేస్తానని చంద్రబాబు చెప్పారని గుర్తు చేశారు. నేటికి ఒక్కరికి కూడా నగదు జమకాలేదని ఆయన ధ్వజమెత్తారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇవ్వలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని తెలిపారు. యూనిఫాం, బూట్లు, టై, బెల్ట్, బ్యాగ్ ఇవ్వకపోవడం దారుణమని ఆయన విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు చెప్పిన మాట ప్రకారం నాటి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి నగదు సకాలంలో అందజేశారని, విద్యార్థులకు యూనిఫాం, బ్యాగ్‌లు కూడా పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేనాటికే పంపిణీ చేశారని సుభాని గుర్తు చేశారు.

నేడు పునీత అంథోని మందిరం వార్షికోత్సవం



పునీత అంథోని చర్చి

రెంటచింతల: స్థానిక పునీత అంథోని వారి చర్చి 37వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కానుకమాత చర్చి విచారణ గురువులు ఏరువ లూర్థుమర్రెడ్డి గురువారం తెలిపారు. చర్చి వార్షికోత్సవం పురస్కరించుకుని ఉదయం 10 గంటలకు గురువులతో పవిత్ర సమిష్టి దివ్య పూజాబలిని సమర్పించనున్నట్లు ఆయన చెప్పారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పునీత అంథోని వారిని నిండు మనస్సుతో ప్రార్థించి దీవెనలు పొందాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా చర్చిని రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించినట్లు తెలిపారు. ప్రత్యేకంగా అలంకరించిన అంథోని వారి విగ్రహంతో గ్రామ పురవీధుల్లో ఊరేగింపును నిర్వహించనున్నట్లు లూర్థు మర్రెడ్డి పేర్కొన్నారు.

పాస్టర్లు డేవిడ్‌రాజు, బాలకుమార్‌లకు గౌరవ డాక్టరేట్లు





డాక్టరేట్ అందుకుంటున్న పాస్టర్లు డేవిడ్‌రాజు, బాలకుమార్

దాచేపల్లి : మాదినపాడు తెలుగు బాప్టిస్ట్ చర్చి పాస్టర్ కె.ఎస్. డేవిడ్‌రాజు, దాచేపల్లి ఎస్సీ కాలనీ తెలుగు బాప్టిస్ట్ చర్చి పాస్టర్ బండ్ల అనిల్‌కుమార్ గౌరవ డాక్టరేట్లు అందుకున్నారు. క్రీస్తు పరిచర్యలో నిర్విరామంగా అందించిన వీరి సేవలను అమెరికా బాప్టిస్ట్ ఫారిన్ మిషన్ సొసైటీ గుర్తించింది. విజయవాడలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పాస్టర్లు డేవిడ్ రాజు, బాలకుమార్‌లకు గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేసింది. ప్రభువైన ఏసుక్రీస్తు సేవను మరింతగా ప్రకటించేందుకు శక్తివంచన లేకుండా పని చేస్తామని వారు చెప్పారు. గౌరవ డాక్టరేట్ అందుకున్న వీరిని పలువురు పాస్టర్లు అభినందించారు.

మోదీ పాలనలో దేశం అభివృద్ధి

సమావేశంలో స్పష్టం చేసిన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి



మాట్లాడుతున్న జయప్రకాష్, నాయకులు

నరసరావుపేట: దేశంలో 2014లో ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ బాధ్యతలు చేపట్టాక దేశం అన్నీ రంగాల్లో అభివృద్ధి చెందుతుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఎస్ఎస్ఎన్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో జిల్లా, స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. గత 11 ఏళ్లలో ప్రపంచంలో పదో స్థానంలో ఉన్న దేశ ఆర్థిక రంగం ఇప్పుడు నాల్గవ స్థానానికి చేరిందన్నారు. భారత్ ఆర్థిక వ్యవస్థ 4.5 ట్రిలియన్‌కు చేరిందన్నారు. ఐఎంఎఫ్ నివేదిక ప్రకారం దారిద్ర్యం కిందనున్న 27 కోట్ల మంది ప్రజలు దాన్ని అధిగమించటంతో పేదలు ఐదు కోట్లకు మాత్రమే పరిమితమయ్యారన్నారు. ప్రజల అవసరాలను తెలుసుకొని బీజేపీ ప్రభుత్వం నడుస్తుందని తెలిపారు. ప్రజలను నాలుగు వర్గాలుగా పేదలు, మహిళలు, యువకులు, రైతులు విభజించి అభివృద్ధి చేస్తున్నారన్నారు. గరీబ్ కల్యాణ్ యోజన పేరుతో 81 కోట్ల మందికి ఉచిత రేషన్ ఇస్తున్నారన్నారు. ఆయుష్మాన్ భారత్ పేరుతో పేదలందరికీ రూ.5 లక్షలు చొప్పున ఉచిత వైద్యసేవలు అందజేస్తున్నారన్నారు. మహిళల ఆత్మగౌరవం కోసం 23 కోట్ల మందికి స్వచ్ఛభారత్ అభియాన్ పేరుతో మరుగుదొడ్ల నిర్మాణం చేశారన్నారు. ముద్ర యోజనతో మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పిస్తూ పావలా వడ్డీకి రూ.25 లక్షల వరకు రుణం అందజేస్తుందన్నారు. ఫసల్ బీమా యోజన పేరుతో రైతులకు అకాల వర్షాలు, ఫసల్‌యోజన పేరుతో మద్దతు తెలియచేస్తుందన్నారు. ధాన్యంకు రూ.1200లు నుంచి రూ.2300లకు మద్దతు ధర పలికారన్నారు. కిసాన్‌యోజన పేరుతో రూ.6 వేలతో ప్రతిరైతుకు అందజేస్తున్నారన్నారు. సమావేశంలో ప్రోగ్రాం కన్వీనర్ కపర్ది, జిల్లా అధ్యక్షులు శశికుమార్, జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్, జిల్లా మాజీ అధ్యక్షులు ఆలోకం సుధాకర్ బాబు పాల్గొన్నారు.